సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 4 । జూలై । 2023

I



అపర సంజీవని.. 108

సీఎం వైఎస్ జగన్ హయాంలో 108 అత్యవసర సేవలకు పునరుజ్జీవం వచ్చింది. తాజాగా మరిన్ని అంబులెన్సులు అందుబాటులోకి వచ్చాయి. IIలో ▸



240 మద్యం సీసాలు స్వాధీనం

జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం శివారులో తనిఖీల్లో 240 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. IIలో ▸

మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ సుధాకర్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. తణుకు కమిషనర్‌గా ఉన్న ఆయనను ఇన్‌చార్జ్‌గా నియమించిన సంగతి తెలిసిందే

న్యూస్‌రీల్

జగనన్న సురక్ష సమర్థంగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్న సురక్ష కార్యక్రమం ప్రత్యేక క్యాంపులను మరింత సమవర్ధవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి జగనన్న సురక్ష, గృహ నిర్మాణం, మనబడి నాడు–నేడు, జగనన్నకు చెబుదాం, జాతీయ ఉపాధి హామీ పనులు, జలకళ తదితర అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులలో ఎన్ని టోకెన్లు ఇచ్చారు, వాటి ప్రకారం ప్రజలకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారా, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారా? అని సమీక్షించారు. ప్రత్యేక క్యాంపులలో హెల్ప్ డెస్క్, వైద్య శిబిరం, చిన్నపిల్లలకు ఆధార్ నమోదు కేంద్రం తదితర మౌలిక సదుపాయాలను కల్పించి ఏ ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలన్నారు. గృహ నిర్మాణం, జాతీయ ఉపాధి హామీ పనులు, జలకళ, మన బడి నాడు -నేడు పనులు, మండలాలు, పురపాలక సంఘాల వారీగా ప్రగతిని కలెక్టరు సమీక్షించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

సాక్షి, భీమవరం: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యు.రవిప్రకాష్ సూచించారు. భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ స్పందనకు ఆయన హాజరై అర్జీలు స్వీకరించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అకౌంట్‌కు కేవైసీ చేయాలని చెప్పి పంపించే మెసేజ్‌లు, ఎలక్షన్ కార్డుకు పాన్ కార్డును జత పరచాలని చెప్పే లింకులకు గాని స్పందిస్తే బ్యాంక్ అకౌంట్ ఖాళీ అవుతుందన్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలలో బహుమతులు వచ్చాయని వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

సాక్షి, భీమవరం: ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సోషల్, రసాయన శాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ వెంకటరమణ తెలిపారు. 1094 మంది విద్యార్థులకు 908 మంది హాజరయ్యారన్నారు.

● ఒక్క రోజులోనే పత్రాలు జారీ



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు జరీనా.. నూజివీడు పట్టణంలోని ఎమ్మార్అప్పారావు కాలనీకి చెందిన ఆమె ఇద్దరు పిల్లల్లో ఒకరు ఇంటర్, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. కాలేజీలో, స్కూల్‌లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అడుగుతుండటంతో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేయించారు. దరఖాస్తు చేసిన ఒక్కరోజులోనే సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లను ఆమె తీసుకుంది. గతంలో ఈ సర్టిఫికెట్లు తీసుకోవాలంటే రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటికి వచ్చి ఒక్కరోజులోనే ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● నాలుగు రోజుల్లోనే సర్టిఫికెట్ల జారీ



ఈ ఫొటోలో మహిళ పేరు వెట్టి వెంకటలక్ష్మి. బుట్టాయగూడెం మండలం రాగప్పగూడెంలో నివసిస్తున్న ఆమె వ్యవసాయ కూలీ. అచ్చియ్యపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంపులో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందింది. గత ప్రభుత్వ హయాంలో ఈ సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రం వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. రూ. 500 వరకూ ఖర్చు చేయాల్సి వచ్చేది. నాలుగు రోజుల క్రితం జగనన్న సురక్ష పథకంలో ఆమె ఇంటికి వెళ్లిన వలంటీర్లు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరమని గుర్తించి దరఖాస్తు చేయించారు. జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్లు ఉచితంగా పొందడంతో ఆనందం వ్యక్తం చేసింది.

● రూపాయి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు



ఈమె పేరు గుళ్ళ వెంకటలక్ష్మి. చింతలపూడి మండలం, రేచర్ల గ్రామం. కుల ధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రేచర్ల సచివాలయంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకుంది. వారం క్రితం వలంటీర్ వివరాలు సేకరించి అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం యాప్‌లో నమోదు చేశారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా సోమవారం రేచర్ల సురక్ష క్యాంప్‌లో మహిళకు ఉచితంగా అధికారులు కుల, ఆదాయ ధృవీకరణ పత్రం అందచేశారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా సర్టిఫికెట్లు ఇచ్చేవారు కాదని ముఖ్యమంత్రి అధికారులను తమ గ్రామం పంపించి కావలసిన సర్టిఫికెట్లు అందచేయడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

జగనన్న సురక్ష సక్సెస్

- మూడు రోజుల్లో ఏలూరు జిల్లాలో 16 వేల విజ్ఞప్తుల పరిష్కారం
- అందుబాటులో 11 రకాల సేవలు
- మండల స్థాయి అధికారులతో రెండు బృందాలు ఏర్పాటు
- ఇంటికే వచ్చి ధ్రువపత్రాల అందజేత



పెదవేగి మండలం గార్లమడుగులో అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జేసీ లావణ్యవేణి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రజా సంక్షేమమే పరమావధిగా భావిస్తూ ప్రభుత్వం అందించే ప్రతి పథకం లబ్ధిదారులకు చేరేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అర్హత ఉండి, ప్రజలకు చేరాల్సిన పథకాలు, ప్రభుత్వం అందించే సేవలు అందని ప్రజల వద్దకు ప్రభుత్వ అధికారులు నేరుగా వెళ్లి ఆయా సేవలను అందిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందాలని, ఏ ఒక్కరికీ ప్రభుత్వ పథకం దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు ప్రతి ఒక్క పథకం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకించి సురక్ష క్యాంపులు ఏర్పాటు చేస్తూ 11 రకాల సేవలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలకు అందించాల్సిన ప్రతి ఒక్క సేవను ప్రజలకు వివరిస్తూ సురక్ష క్యాంపుల ద్వారా మిగిలిపోయిన అర్హులను గుర్తిస్తూ వారికి అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారు. ఆయా అధికారుల పర్యవేక్షణలో ఈ జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతోంది. ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, పశ్చిమగోదావరి కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక అధికారులను నియమించి వారి ద్వారా ఎప్పటికప్పుడు సురక్ష క్యాంపులను పర్యవేక్షిస్తున్నారు.

అర్హులందరికీ లబ్ధి అందేలా

ఏలూరు జిల్లా వ్యాప్తంగా జూలై 1న 24 మండలాల పరిధిలో 23 సచివాలయాలలో 438 మంది వలంటీర్లు 29,586 గృహాలను సందర్శించి 8,351 వినతులు స్వీకరించారు. వీటిలో 6,898 దరఖాస్తులు అక్కడికక్కడే పరిశీలించి పూర్తి చేశారు. అదే విధంగా 3వ తేదీన 22 మండలాల పరిధిలో 24 సచివాలయాల ద్వారా 422 మంది వలంటీర్లు 27,002 గృహాలను సందర్శించి 10,101 వినతులు స్వీకరించారు. వీటిలో 8,679 వినతులు పరిష్కరించారు. ఈ విధంగా ఎక్కడికక్కడ సమస్యలు, వినతులను పరిష్కరిస్తూ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తూ అర్హులైన వారికి ప్రభుత్వ లబ్ధిని అందిస్తున్నారు. నెల రోజుల పాటు చేపట్టే ఈ సురక్ష క్యాంపుల ద్వారా అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదని భావిస్తున్న జగనన్న సర్కారు ఆ మేరకు చర్యలు తీసుకుంటుంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే..



సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లా పరిధిలో నిర్వహిస్తున్నాం. ప్రజల నుంచి సురక్ష కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. సురక్ష కార్యక్రమానికి ప్రత్యేకంగా అధికారులను సైతం నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ధ్రువీకరణ పత్రాలు అందేలా చూస్తున్నాం.

– వై.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

పవన్ కల్యాణ్ ప్యాకేజ్ స్టారే

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



రావిపాడులో అమ్మఒడి చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: గత టీడీపీ అవినీతి పాలనను ప్రశ్నించని పవన్ కల్యాణ్ నిజంగా ప్యాకేజ్ స్టారే అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడు మండలం రావిపాడులో అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జెడ్పీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఆర్థిక అసమానతలు రూపుమాపేలా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఓటేయమని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక దోపిడీని పవన్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. చంద్రబాబుకు అమ్ముడు పోయిన పవన్ కల్యాణ్ నిజంగా పవర్ స్టార్ కాదు.. ప్యాకేజీ స్టారే అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 5 ఏళ్లలో చంద్రబాబును పల్లెత్తు మాట అనలేదన్నారు. రైతుల రుణమాఫీ చేయకపోయినా, డ్వాక్రా రుణాలు రద్దు చేయకపోయినా, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తానన్న మాటను నిలబెట్టుకోలేకపోయినా, నిరుద్యోగ భృతి ఇవ్వకపోయినా, కాపులకు రిజర్వేషన్ ఇస్తానని చెప్పి మోసగించినా చంద్రబాబును నిలదీయలేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ విచ్చలవిడి దోపిడీ చేసినా ప్రశ్నించని పవన్‌ను ప్రజలు ఏమని అర్థం చేసుకోవాలని మంత్రి ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పేదలకు సరైన విద్య అందేది కాదని.. శిథిలమైన ప్రభుత్వ భవనాలలోనే పాఠశాలలు నడిచేవన్నారు. నేడు జగనన్న విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేశారన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న వారికి కొమ్ముకాస్తూ పచ్చమీడియాలు తప్పులు చేస్తున్నాయన్నారు. అమ్మఒడిలో రూ 8.42 కోట్ల చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి, సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, ఎంపీటీసీ బొచ్చెల తాతారావు, ఎంఈవో ఎం.శ్రీనివాస్, ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు రోజుకు రూ.2 కోట్లు ఇస్తే చాలు

తాడేపల్లిగూడెం రూరల్: ఎన్నికల్లో ఓడిపోయి డబ్బులు సంపాదించే పార్టీ ఏదైనా ఉందంటే అది జనసేన అని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో ఆయన మాట్లాడుతూ.. పవన్‌కు రోజుకు రెండు కోట్లు ఇస్తే రాష్ట్రం, దేశం, ప్రజలు ఏమైనా పర్వాలేదని దుయ్యబట్టారు.

జాప్యం లేకుండా స్పందన అర్జీలు పరిష్కరించాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా నాణ్యమైన విధంగా పరిష్కరించాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజల నుంచి కలెక్టరు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పరిష్కారం చేసేటప్పుడు ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఫొటో అప్‌లోడ్ చేయాలని, సమస్య పరిష్కారం కాకముందు ఉన్న ఫొటో, పరిష్కారం అయిన తర్వాత ఫొటోలు అప్‌లోడ్ చేయకపోతే వాటిని పరిష్కరించని వాటికి పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టరు అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 259 దరఖాస్తులు వచ్చాయి.

స్పందన ఫిర్యాదుల్లో కొన్ని.. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నానని, ఆస్పత్రులకు చాలా ఖర్చయ్యిందని ఆర్థిక సాయం చేసి ఇంటి స్థలం మంజూరు చేయాలని పాలకోడేరు మండలం కుముదవల్లికి చెందిన కట్టా దుర్గా పార్వతి అర్జీ అందజేసింది. తనకు పెంటపాడు మండలం పడమర విప్పర్రులో 88 సెంట్లు పంట భూమి ఉందని.. దానిని వెబ్ ల్యాండ్‌లో చేర్చి న్యాయం చేయాలని భీమాల నాగేశ్వరరావు కోరారు. జాయింట్ కలెక్టరు రామ్ సుందర్ రెడ్డి, డీఆర్‌వో కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



● ఉరిమిన మేఘం

జూలై నెల వచ్చినా.. సరిగా వర్షం జాడలేదు. ప్రజలు వర్షాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘం ఉరిమింది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. ఏలూరు నగరంలో గత కొన్ని రోజుల నుంచి ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వర్షంతో కాస్త ఉపశమనం దొరికింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

● శాకంబరిగా..



ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం మావుళ్లమ్మకు శాకంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయమంతా కూరగాయలతో అలంకరించారు. చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పంచారామ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ ఉమా సోమేశ్వరస్వామికి ఆషాఢ మాసం సందర్భంగా పలు రకాల పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు.

– భీమవరం(ప్రకాశంచౌక్)

అందరికీ చేరువలో వైద్య సేవలు

- పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లోనే అన్ని సౌకర్యాలు
- పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు, చిన్నపాటి ఆపరేషన్లు
- ఏరియా, జిల్లా ఆసుపత్రులపై తగ్గుతున్న భారం



తుందుర్రు పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సుగుణరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): పేదలకు స్థానికంగానే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేశారు. పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆసుపత్రి వరకూ పూర్తి స్థాయిలో వైద్యులను ఏర్పాటు చేయడంతోపాటు అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. దాంతో వైద్య సేవలు విస్తరించాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు స్థానికంగానే వైద్య సేవలు అందుకుంటున్నారు. పట్టణాల్లో ఉన్న సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందే పరిస్థితి నేడు లేదు.

పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లోనే డెలివరీలు, ఆపరేషన్లు

గ్రామీణ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పూర్తి స్థాయిలో వైద్యులను నియమించి అన్ని సౌకర్యాలు కల్పించారు. దాంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీలతోపాటు, చిన్నపాటి ఆపరేషన్లు కూడా జరుగుతున్నాయి. దాంతో వేల రూపాయలు ఖర్చు చేసుకుని ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించుకునే భారం ప్రజలకు బాగా తగ్గింది. జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో నెలకు 10 నుంచి 15 డెలివరీలు, 30 ఇతర ఆపరేషన్లు చేస్తున్నారు.

అర్బన్ పీహెచ్‌సీల్లో పట్టణ ప్రజలకు వైద్య సేవలు

అర్బన్‌లోని యూపీహెచ్‌సీలు (అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలోని పలు పట్టణాల్లో నూతనంగా అర్బన్ పీహెచ్‌సీలు మంజూరు చేసి వాటికి శాశ్వత భవనాలు కూడా నిర్మించారు. వైద్యులతోపాటు, వైద్య సౌకర్యాలు పుష్కలంగా ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటికే వైద్య సేవలు

ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రవేశపెట్టడంతో ఆయా గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నారు. అటు పీహెచ్‌సీలు, ఇటు ఏరియా ఆసుపత్రులకు చిన్నపాటి వైద్యానికి వెళ్లే వారి సంఖ్య తగ్గింది.

ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

స్థానికంగానే వైద్య సేవలు అందించడంతో పట్టణాల్లోని జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రిలకు వచ్చే పేషెంట్ల సంఖ్య తగ్గింది. గతంలో జిల్లా ఆసుపత్రికి(తణుకు) రోజుకు సుమారు 500 మంది వచ్చేవారు. నేడు 300 మంది వరకూ మాత్రమే వస్తున్నారు. ఏరియా ఆసుపత్రికి గతంలో రోజుకు 350 మంది పేషెంట్లు వచ్చే వారు. నేడు 250 మంది వైద్యానికి వస్తున్నారు. పేషెంట్ల సంఖ్య తక్కువగా ఉండడంతో వైద్యులు ఎక్కువ సమయం కేటాయించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. డెలివరీ విషయంలో వైద్యులు ఒత్తిడికి గురవకుండా పేషెంట్లకు మానసిక ధైర్యం కల్పిస్తూ డెలివరీలు చేస్తున్నారు. జిల్లాలోని జిల్లా ఆసుపత్రి నుంచి ఏరియా ఆసుపత్రి వరకూ ప్రభుత్వం ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్కానింగ్, వెంటిలేటర్ దగ్గర్నుంచి బ్లడ్ బ్యాంక్ ఫ్రీజర్ వరకూ ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి.

గత ప్రభుత్వంలో అరకొర వైద్యం

గత ప్రభుత్వంలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు అధ్వానంగా ఉండేవి. వైద్యులు, సౌకర్యాల కొరతతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందేవి కావు. స్థానిక పీహెచ్‌సీల్లో కనీసం నెలకు 2 డెలివరీలు, ఒక ఆపరేషన్ కూడా జరిగేది కాదు. దాంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకుని వైద్యం పొందేవారు.

స్థానికంగానే వైద్య సేవలు



జిల్లాలో పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలకు పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత స్థానికంగానే డెలివరీలు, చిన్నపాటి ఆపరేషన్లు జరుగుతున్నాయి. దాంతో జిల్లా, ఏరియా ఆసుపత్రులకు వచ్చే పేషెంట్ల సంఖ్య గతంతో పోలిస్తే తగ్గింది. దాంతో ఏరియా ఆసుపత్రిల్లో నాణ్యత ప్రమాణాలతో కూడిన వైద్యం అందించగలుగుతున్నాం. ఫ్యామిలీ డాక్టర్ విధానంవల్ల కూడా ఓపీ సంఖ్య తగ్గుతుంది.

– ఎం.వీరాస్వామి, డీసీహెచ్ఎస్, భీమవరం

జిల్లాలో ప్రభుత్వాసుపత్రుల్లో ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలు..

సౌకర్యం	సంఖ్య
వెంటిలెటర్లు	140
ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు	362
ఈసీజీజమెషీన్లు	6
సీటీజీ మెషీన్లు	6
యూఎస్‌జీ మెషీన్లు	8
ఎక్స్‌రే మెషీన్లు	7
ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్స్	2
బయోకెమెస్ట్రీ అనలైజర్స్	8
మైక్రోస్కోప్‌లు	8
ఎలక్ట్రోలైట్ అనలైజర్	9
యూఎస్‌జీ మెషీన్లు	8
ఫొటో థెరపీ యూనిట్లు	9
పీహెచ్ మీటర్లు	25
బ్లడ్‌బ్యాంక్ ఫ్రిజర్లు	11

జిల్లాలో ఏరియా ఆసుపత్రులు
భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, తాడేపల్లిగూడెం

జిల్లా ఆసుపత్రి	కమ్యునిటీ హెల్త్ సెంటర్లు
తణుకు	పెనుగొండ, ఆకివీడు, ఆచంట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	అర్బన్ పీహెచ్‌సీలు
32	18

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు	జిల్లా, ఏరియా ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు
64	70

క్లుప్తంగా

240 మద్యం బాటిళ్లు స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



పట్టుపడిన మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): కామయ్యపాలెం శివారులో అక్రమ మద్యం కలిగి ఉన్న అశ్వారావుపేటకు చెందిన హుస్సేన్‌ను అదుపులోకి తీసుకుని అతని నుంచి 240 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ చెప్పారు. అక్రమంగా కలిగి ఉన్నట్లు సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అపర సంజీవని.. 108

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత 108 అత్యవసర సేవలకు పునర్జీవం వచ్చింది. మహానేత వైఎస్సార్ ఆశయాలు పుణికిపుచ్చుకున్న సీఎం వైఎస్ జగన్ ప్రజల ప్రాణాలను రక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. 2020 జూలై 1న కరోనా కష్టకాలంలో ఏకంగా 1068 కొత్త వాహనాలు కొనుగోలు చేసి జిల్లాలకు పంపారు. తాజాగా మంగళవారం మరోసారి 146 కొత్త 108 అంబులెన్సులను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. ప్రజలకు మేలు చేయాలనే కాంక్షతో వైద్య రంగంపై రూ.వేల కోట్లు నిధులు వెచ్చిస్తున్నారు.



ఏలూరుకు చేరిన కొత్త 108 అంబులెన్స్‌లు

ఏలూరు టౌన్: ప్రజల ప్రాణాలకు విలువనిచ్చే నాయకులు నిత్యం ప్రజలకు మేలు చేసేందుకు పరితపిస్తారనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు మరింత మెరుగైన రీతిలో సేవలు అందించాలనే ఉద్దేశంతో కొత్తగా 108 అంబులెన్సులను కొనుగోలు చేశారు. ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాలకు ఇప్పటికే అంబులెన్సులు ఉండగా తాజాగా మరికొన్ని వాహనాలు అత్యవసర సేవలకు అందుబాటులోకి వచ్చాయి.

ప్రతి మండలానికి 108 అంబులెన్స్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతి మండలానికి 108 అత్యవసర సేవల అంబులెన్సులు ఉండేలా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంది. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను క్షణాల్లో హాస్పిటల్స్‌కు తరలించటం, గర్భిణులు, గుండెపోటు, ఇతర అత్యవసర సేవలకు 108 అంబులెన్స్ విశేష సేవలు అందిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 27 మండలాలలకు గానూ ఒక్కో మండలానికి 108 అంబులెన్స్ ఉండగా, 1 నియోనేటల్ అంబులెన్స్ సేవలు అందిస్తోంది. ఇక పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాలకు ఒక్కో మండలానికి ఒక్కో 108 వాహనం, అదనంగా 1 నియోనేటల్ అంబులెన్స్‌ను ప్రభుత్వం సమకూర్చింది. తాజాగా ఏలూరు జిల్లాకు కొత్తగా 4 అంబులెన్స్ వాహనాలు రాగా, పశ్చిమగోదావరి జిల్లాకు 2 అంబులెన్స్‌లు కేటాయించారు.

- సీఎం వైఎస్ జగన్‌తోనే ప్రజల ప్రాణాలకు రక్షణ
- ఉమ్మడి పశ్చిమకు కొత్తగా 6 అంబులెన్స్‌లు
- ఏలూరు జిల్లాకు మొత్తం 32 వాహనాలు
- పశ్చిమలో 23కు చేరిన వాహనాల సంఖ్య

ఏలూరు జిల్లాలో 108 అంబులెన్స్‌లు	32
జిల్లాలో పాత వాహనాలు	09
2020లో కొత్తగా వచ్చినవి	19
తాజాగా జిల్లాకు కేటాయించినవి	04
టెక్నీషియన్స్ ఈఎంటీలు	70 మంది
మొత్తం వాహనాల్లో పైలెట్స్	70 మంది
పశ్చిమగోదావరి జిల్లాలో 108 అంబులెన్స్‌లు	23
జిల్లాలో పాత వాహనాలు	11
2020లో కొత్తగా వచ్చినవి	10
2023లో తాజాగా కేటాయించినవి	02
టెక్నీషియన్స్ ఈఎంటీలు	52 మంది
మొత్తం వాహనాల్లో పైలెట్స్	52 మంది

మరింత మెరుగైన సేవలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 108 అంబులెన్స్ సేవలకు మరోసారి జీవం పోశారు. ఒకేసారి భారీఎత్తున అంబులెన్స్ వాహనాలు కొనుగోలు చేయటంతోపాటు పటిష్టమైన నిర్వహణతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాలకు పూర్తిస్థాయిలో ఎలాంటి కొరత లేకుండా 108 వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. కేవలం 10 నిమిషాల్లోపే సంఘటనా స్థలాలకు చేరుకుని ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచాయి.

– జీ.గణేష్, అత్యవసర సేవల జోనల్ మేనేజర్, ఏలూరు

సంతోషంగా ఉంటుంది



108 అత్యవసర సేవల అంబులెన్స్‌లో పనిచేయటం సంతోషంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలు, ఇతర అనారోగ్యంతో సీరియస్‌గా ఉన్న పరిస్థితుల్లో వారికి ప్రాథమిక చికిత్స అందిస్తూ సకాలంలో హాస్పిటల్స్‌కు చేర్చటం, ప్రజల ప్రాణాలు కాపాడటంలో మా వంతు పాత్ర పోషించటం సంతృప్తినిస్తోంది. నిత్యం ఎంతోమందిని హాస్పిటల్స్‌కు సకాలంలో చేర్చటం ద్వారా ప్రాణాలు నిలబడతాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నారు.

– ఏడుకొండలు, ఈఎంటీ, ఏలూరు

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: వెంకటరామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్: తణుకులోని 5వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఉపాధి కల్పన, నైపుణ్యం పెంపే లక్ష్యం



ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు ధ్రువీకరణలు అందించిన దృశ్యం

ఆకివీడు: ఉపాధి కల్పనతో పాటు, యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో మొదటవిడతగా 450 మంది విద్యార్థులకు వివిధ కేటగిరిల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్న టైలరింగ్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేషన్, ఏసీ, ఆక్వా టెక్నీషియన్, వెబ్, ప్లంబింగ్, బ్యూటీషియన్, టాలీ, కంప్యూటర్‌లలో శిక్షణ ఇచ్చామని చెప్పారు. దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 50 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. యువతీ యువకులు ఆయా రంగాల్లో ఉపాధి పొందేందుకు ఇటువంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీటీ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధిపై దృష్టి పెట్టి, ఆయా రంగాల్లో నైపుణ్యం సాధిస్తే మెరుగైన ఉపాధి లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ ఇటువంటి శిక్షణల్ని విద్యార్థులు, గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాల్ని పంపిణీ చేశారు. సమావేశంలో కళాశాల సీడీపీ కార్యదర్శి నంబూరి వెంకట్రామరాజు(తాడినాడ బాబు), పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు జీ.కృష్ణమూర్తి, కార్యదర్శి నేరెళ్ల రామచెంచయ్య, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ సీహెచ్ అనిల్ దాయ్, జీ.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరాధ్యుడు ఎస్‌వీ రంగారావు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- తాడేపల్లిగూడెంలో రంగారావు విగ్రహానికి గజమాలతో నివాళి



ఎస్వీ రంగారావు విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పిస్తున్న కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తన నటనతో ప్రపంచాన్ని మెప్పించిన ఎస్వీ రంగారావు తెలుగు నటుడు కావడం గర్వకారణమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆరాధ్యుడు, విశ్వ విఖ్యాత నట చక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ ఎస్వీఆర్ సర్కిల్‌లోని రంగారావు విగ్రహానికి మంత్రి కొట్టు సత్యనారాయణ గజమాల వేసి నివాళులర్పించారు. ఎస్వీఆర్ విదేశీయుడైతే ఆయన నటనకు ఆస్కార్ అవార్డు ఇచ్చి గౌరవించేవారన్నారు. హీరో, విలన్ ఏ పాత్ర అయినా పోషించడంలో రంగారావు తనకు తానే సాటి అని కొనియాడారు. ఎస్వీ రంగారావు విగ్రహం నెలకొల్పిన ఈ సర్కిల్‌లో నలుదిక్కులా నిత్యం దేదీప్యమానంగా వెలుగొందాలని ఉద్దేశంతో మునిసిపల్ నిధులు రూ.4.50 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఎస్వీఆర్ జయంతి రోజునే హైమాస్ట్ లైట్లు ప్రారంభించి ప్రజలకు అంకితం చేసినట్లు చెప్పారు.

విగ్రహం ఏర్పాటుకు కూడా అభ్యంతరాలే

కాపులకు ప్రాధాన్యత కలిగిన తాడేపల్లిగూడెంలో ఎస్వీ రంగారావు విగ్రహం ఏర్పాటుకు కూడా అభ్యంతరాలు సృష్టించిన చరిత్ర ఇక్కడ నాయకులకు ఉందని కొట్టు సత్యనారాయణ విమర్శించారు. విగ్రహాన్ని ఆవిష్కరించడానికి మెగాస్టార్ చిరంజీవిని ఆహ్వానించగా, దీనికి అన్ని అనుమతులు ఉన్నాయో లేదో అని చిరంజీవి ఆరా తీసినప్పుడు అసలు విషయం బయటపడిందన్నారు. ఈ సెంటర్‌లో ఎస్వీ రంగారావు విగ్రహం పెట్టడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆనాటి కౌన్సిల్ చేసిన తీర్మానం కాపీని కూడా తాను బయటకు తీయించి నిర్వాహకులకు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. దీంతో చిరంజీవి వెనక్కు తగ్గి తనతో మాట్లాడటంతో తాను నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ఎస్వీఆర్ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకురావడం, దీంతో చిరంజీవి ఇక్కడికి వచ్చి, విగ్రహం ఆవిష్కరించడం, అనంతరం చిరంజీవి ప్రసంగంలో ఈ విషయాలు బహిరంగంగా వెల్లడించారని మంత్రి చెప్పారు. ఊర్లో నాయకులు మాటలు చెప్పినట్లుగా పనులు చేయరని మంత్రి విమర్శించారు.

ఎస్వీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని వినతి

అనంతరం ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి ద్వారా కేంద్రానికి లేఖ రాయించాలని విన్నవిస్తూ ఎస్వీఆర్ కమిటీ అధ్యక్షులు భోగిరెడ్డి రాము, శివాజీ తదితరులు మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మునిసిపల్ ఇంజనీర్ డి.మురళీకృష్ణ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి సంపత్ కుమార్, దూద్ బాషా, వట్టి బుజ్జి, చామన సూర్యచంద్రరావు, కోడే శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎస్వీఆర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను విస్తృతం చేస్తాం



మాట్లాడుతున్న ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సేవల ద్వారా గత ఏడాది కాలంలో రూ.175 కోట్ల ఆదాయం లభించిందని ఆర్టీసీ పశ్చిమ, ఏలూరు జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు చెప్పారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ త్వరలో కార్గో సేవలను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో డోర్ డెలివరీ సేవలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 డోర్ డెలివరీ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సిబ్బంది సమష్టి కృషితో అందిస్తున్న కార్గో సేవలు ప్రజల మన్ననను పొందుతున్నాయన్నారు. టిమ్స్ విధానంలో గ్రామీణ ప్రాంతాలనుంచి పార్సిల్ పిక్ అప్ చేసుకుని వాటిని సమీప పాయింట్ల ద్వారా గమ్య స్థానాలకు చేర్చే ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఏపీబీ ఏజెన్సీలను నిరుద్యోగ యువత ఏర్పాటు చేసుకోవచ్చునని, పికప్, రిసీవింగ్ పార్శిళ్లపై కమిషన్ అందజేస్తామన్నారు. కార్గో సేవలను మెరుగుపరిచే విధంగా తాడేపల్లిగూడెం ప్రాంతంలోని జామకాయలు, ఉల్లిపాయల వర్తకులతో మాట్లాడినట్లు చెప్పారు. వారు కూడా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ప్రజలంతా ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకుని సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. డిపో మేనేజర్ ఏలూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 2017 నుంచి ఆర్టీసీ కార్గో సేవలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని, ఈ సేవలను ప్రజలు, వ్యాపారులు, వర్తకులు వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది, యూనియన్ నాయకులతో, ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించి కార్గో సేవలను మెరుగుపరిచే అంశాలపై అవగాహన కల్పించారు. డీఎంఈ మాధవ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు కిందపడి కూలీ మృతి



సాయిప్రసాద్ (ఫైల్)



ఘటనా స్థలంలో సాయిప్రసాద్ మృతదేహం

పోడూరు: మట్టి లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు మీద నుంచి వెళ్లడంతో ఓ కూలీ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మట్టపర్రు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సాయిప్రసాద్ (24) కూలీగా పని చేస్తున్నాడు. బంధువులకు చెందిన ట్రాక్టర్ మట్టి తరలింపు పనులకు వెళ్లాడు. మట్టి తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ చేలో దిగబడిపోగా పైకిలాగుతున్నపుడు సాయిప్రసాద్ ట్రాక్టర్‌కు, ట్రక్కుకు మధ్య రాబర్‌పై నిలబడ్డాడు. ట్రాక్టర్ పైకి రాగానే రాబర్‌పై నిల్చున్న సాయిప్రసాద్ అదుపు తప్పి కిందపడిపోయాడు. వెంటనే మట్టిలోడుతో ఉన్న ట్రక్కు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిప్రసాద్ తల్లిదండ్రులు లక్ష్మి, శ్రీనివాసరావు కూలీలే. వీరికి సాయిప్రసాద్, వివాహమైన ఇద్దరు కుమార్తెలు సంతానం. చేతికి అందివచ్చిన ఒక్కడానొక్క కొడుకు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సాయి ప్రసాద్ భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి, తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల మైదానంలో ఈ నెల 9న అండర్-15, అండర్-19 ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2008 సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత, అండర్-19 విభాగంలో పాల్గొనే వారు 2004 సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత పుట్టినవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 29 వరకు మంగళగిరిలో జరిగే అంతర జిల్లాల క్రికెట్ పోటల్లో పాల్గొంటారన్నారు. మరింత సమాచారం కోసం 94910 44848 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

జనసేన సమావేశం రసాభాస

పెనుగొండ: పెనుగొండలో జనసేన సమావేశం రసాభాసగా మారింది. ఇటీవల ఆ పార్టీ పెనుగొండ మండల, పట్టణ అధ్యక్షులను మార్పు చేశారు. మండల అధ్యక్షుడు కంబాల బాబులు స్థానంలో కొండేటి శ్రీనివాసరావును, పట్టణ అధ్యక్షుడు యర్రంశెట్టి బాబూరావు స్థానంలో గుర్రాల సూరిబాబును నియమించారు. దీనికి గాను ఆదివారం రాత్రి పెనుగొండలోని త్యాగరాజ గాన సభలో నూతన కమిటీ అభినందన సభ ఏర్పాటు చేశారు. పార్టీ ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జి చేగొండి సూర్యప్రకాష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు జనసేన కార్యకర్తలు తమకు అన్యాయం జరిగిందంటూ వీరావేశంతో సూర్యప్రకాష్‌ను సమావేశంలోనే నిలదీశారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. సుమారు గంటకు పైగా ఒకరిపై ఒకరు కేకలు వేస్తూ వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో ఒక దశలో తోపులాట జరగగా, కార్యకర్తలతో పాటు వీర మహిళలు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ వీరంగం సృష్టించారు. ఈ క్రమంలో కొందరు కార్యకర్తలు సభ ప్రధాన ద్వారం మూసివేయడంతో వివాదం మరింత ముదిరింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు రంగప్రవేశం చేసి త్యాగరాజ గాన సభ తలుపులు తెరిపించారు. దీంతో తమపై అసభ్యంగా ప్రవర్తించారంటూ ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమైంది. మరో వర్గం కూడా ఇన్‌చార్జి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వారూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అర్ధరాత్రి దాటేవరకూ ఇరువర్గాలు అక్కడే ఉండి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు సిద్ధం చేశారు. చివరిలో తమకు పోలీసు చర్యలు వద్దని, జిల్లా నాయకత్వం వద్దే మీ అంతు చూస్తామంటూ ఇరువర్గాలూ హెచ్చరికలు చేసుకుని ఫిర్యాదులు వెనక్కి తీసుకుని వెళ్లిపోవడం కొసమెరుపు. దీనిపై పెనుగొండ ఎస్సై రమేష్‌ను వివరణ కోరగా.. జనసేనకు చెందిన ఇరువర్గాలు ఆదివారం అర్ధరాత్రి స్టేషన్‌కు వచ్చాయని, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు రాసుకుని ఇవ్వకుండానే జిల్లా నాయకత్వం వద్ద తేల్చుకుంటామంటూ వెళ్లిపోయారని వివరించారు.

స్థలం కబ్జా కేసులో ముగ్గురి అరెస్టు

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని స్థానిక జీపీఆర్ లేఅవుట్‌లో కబ్జాకు గురై, చేతులు మారిన ఒక ప్లాట్‌కు సంబంధించిన కేసులో రాజమహేంద్రవరానికి చెందిన తానేపల్లి వెంకట రామకృష్ణ, నెట్ల కల్యాణ్ కుమార్, రౌతు రమేష్ నాయుడును పోలీసులు అరెస్టు చేశారు. నార్త్‌జోన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం పాందువ్వకు చెందిన వేగేశ్న వెంకటరంగ అచ్యుత సత్యనారాయణరాజు స్థానిక జీపీఆర్ లేఅవుట్‌లో సర్వే నంబర్ 471/1లో 402 గజాల స్థలాన్ని కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసి ఖాళీగా వదిలేశాడు. ఇటీవల తమ గ్రామంలోని సచివాలయంలో ఈసీ చూస్తే ఆ స్థలం వేరొకరి పేరు మీద ఉన్నట్టు తెలిసింది. దీంతో వెంటనే రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు తెలిశాయి. స్థలం అసలు యజమాని అయిన సత్యనారాయణరాజు చనిపోయినట్టుగా డెత్ సర్టిఫికెట్ సృష్టించిన నేరగాళ్లు, స్థలానికి కూడా తప్పుడు పత్రాలు తయారు చేశారు. రూ.60 లక్షలు విలువ చేసే ఆ స్థలాన్ని రూ.40 లక్షలకే వేరొకరికి అమ్మేశారు. నిందితులందరూ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించినవారే. సమావేశంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

చిన్నారుల చదువు బాధ్యత జగన్‌దే...

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- వెంకట్రామన్నగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: చిన్నారులను చదివించే బాధ్యత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతున్న సమయంలో జగన్ పాలన పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తండ్రి నుంచి వారసత్వంగా జగన్ సంక్షేమ పాలన సాగుతోందన్నారు. ప్రజల హృదయాల్లోకి జగన్ ఎలా వెళ్లాడని ఆలోచించకుండా చంద్రబాబు, పవన్‌లు దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. నిన్న మొన్నటి వరకు సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని సీఎం జగన్ అప్పుల పాలు చేస్తున్నారన్న చంద్రబాబు నేడు జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీలివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా చంద్రబాబు అమలు చేశాడా ? అని ప్రశ్నించారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇదిలా ఉంటే ఐదేళ్ల చంద్రబాబు పాలనలో కేఎస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేకపోయారన్నారు. ఏనాడైనా చంద్రబాబును టీడీపీ నాయకులు ప్రశ్నించారా ?అని నిలదీశారు. తాను మంత్రిగా రూ.45 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉండటంతోనే ప్రణాళిబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలు జగన్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటారని, వారికి సంపూర్ణ న్యాయం చేస్తారన్నారు. తొలుత గ్రామంలో ఉడుములమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలిమోను నాగ అంజూష, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్‌లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ల తాతారావు, సొసైటీ డైరెక్టర్ బొట్టా నాగరాజు, విద్యాకమిటి చైర్మన్ నీలపాల సురేష్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, వెలుగు ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.వాణి, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ డి.వెంకటేశ్వరరావు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు పోలిమోను శ్రీనివాస్, ములగాల చినశ్రీను, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఎం పట్టణ కమిటీ సమావేశం సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో పుట్టా వేణుగోపాల చౌదరి అధ్యక్షతన జరిగింది. పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కమిటీ రిపోర్టును ప్రవేశ పెట్టారు. ఆయన మాట్లాడుతూ పెట్రోల్, గ్యాస్, డీజిల్, నిత్యావసర వస్తువులు ధరలు పెరిగాయని, ధరలు పెరుగుదలతో ప్రజానీకం సతమతమవుతున్నారని, ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, మడక రాజు, జవ్వాది శ్రీను, శేషుబాబు, పూర్ణిమ, లక్ష్మి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనంతమ్మ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు


అనంతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాడ మాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం కేఎస్ఎన్ కాలనీలో వేంచేసియున్న అనంతమ్మ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి కుంకుమ పూజలు, లలితా పారాయణం, గరగలతో అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు విరివిగా హాజరై దర్శించారు. కాలనీ సభ్యులు జొన్నల అన్నవరం సత్యనారాయణ, చోడగిరి చిన్నబాబు, పెదబాబు, ఎం.సరోజిని, జి.గిరిజారత్నం, ఉర్రింకల రామాంజనేయులు, స్థానికులు తదితరులు పర్యవేక్షించారు.

సీతమ్మ తల్లికి ఆషాడం సారె అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పౌర్ణమి సందర్భంగా సోమవారం సీతారాంపేటలో వేంచేసియున్న రామాలయంలో కమిటీ అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు దంపతులు ఆధ్వర్యంలో వాసవి మహిళా కమిటీ వారిచే అషాడ పట్టి సీతమ్మ తల్లికి చీర, సారేలు అందజేశారు. మహిళలచే నగర సంకీర్తన చేశారు. రామచంద్రస్వామికి, సీతమ్మతల్లికి నవ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మి, పి.లక్ష్మి, వి.లక్ష్మి, జోగిరత్నం, వాసవి మహిళలు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై సీపీఐ నిరసన

ఇరగవరం: రైతు సమస్యలు పరిష్కారం కోరుతూ ఇరగవరం మండలంలో సోమవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం వీఆర్వో రామలింగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు నామాన వేంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర రైతు సంఘం ఇచ్చిన పిలుపు మేరకు రైతు సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం సమర్పించామన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని కోరారు. 50సంవత్సరాలు నిండిన కౌలు రైతులకు రూ.10వేలు పింఛన్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దా సూర్యనారాయణ, గుడిమెట్ల కోటేశ్వరరావు, కుడిపూడి వెంకట రెడ్డి, మాకినిడి రామకోటి, కాటూరి రాముడు, దాసం శ్రీను చిక్కాల ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీగా విజయ చాముండేశ్వరి అమ్మవారు


అత్తిలిలో శాకంబరీదేవి అలంకరణలో విజయచాముండేశ్వరి అమ్మవారు

అత్తిలి: పట్టణంలోని విజయచాముండేశ్వరి అమ్మవారు సోమవారం భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. అషాడమాసం కావడంతో అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలకరించారు. ఆలయ ధర్మకర్త కందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కలగ కృష్ణవంశీశర్మ పూజాధికాలను జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

బాబా సన్నిధిలో మంత్రి కారుమూరి ప్రత్యేక పూజలు


ఇరగవరంలో సాయి బాబాను దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: గురు పౌర్ణమి పురస్కరించుకొని ఇరగవరం మండలంలోని సాయిబాబాను పౌరసరాఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. అన్ని దానల్లో కన్నా అన్నదానం గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా

- పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకు 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


తణుకు 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 5వ వార్డులో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గడపలోను ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమానికి మేము రుణపడి ఉంటామని ఎదురొచ్చి చెబుతున్న ప్రజానీకాన్ని చూస్తుంటే అటువంటి ముఖ్యమంత్రి కొలువులో మంత్రిగా ఉన్నందుకు గర్వపడుతున్నా నని అన్నారు. ముఖ్యంగా ప్రతి ఇంటిలోను మహిళను ఆర్థికంగా నిలబెడితే ఆ కుటుంబం అభివృద్ధి బాటలో పయనిస్తుందనే ఉద్దేశ్యంతో పథకాల్లో ప్రతి లబ్ధిని మహిళల బ్యాంకు ఖాతాలకే దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా జమచేయడాన్ని ప్రజానీకం స్వాగతిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల సృష్టికర్తగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి గడపలోను పూజిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు గోరుముద్ద పథకాలతో పేదింట కూడా ఇంగ్లీషు మీడియం విద్య అందుబాటులోకి వచ్చిందని స్పష్టం చేశారు. విద్యతోనే పేదింట అభివృద్ధి జరుగుతుందనే విషయాన్ని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెలుగులోకి తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, 5వ వార్డు ఇన్‌చార్జ్ సుద్దుల పాండు, చింతా గౌరినాయుడు, తణుకు సత్యనారాయణ, నాగూర్‌కుమార్, తలపాకుల రాము, చిర్రా వెంకటరావు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు


పెంటపాడులో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం


తణుకు టౌన్ వేల్పూరులోని శ్రీ రమణ మహర్షి ఆశ్రమంలో భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెంటపాడు: శిరిడీ సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. మండలంలో పలు గ్రామాల్లో గురుపౌర్ణమి పురస్కరించుకొని షిర్డీసాయిబాబా ఆలయాలలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పెంటపాడులో గురుపౌర్ణమి పురస్కరించుకొని ఊరచెరువు గట్టున ఉన్న వరసిద్ధి సాయిబాబా ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయట్రస్టీ సభ్యులు కొవ్వూరి లక్ష్మణరెడ్డి, నిముషకవి సూర్యనాగేశ్వరరావు, కర్రి భూపాల్‌రెడ్డి, కర్రి కనికిరెడ్డి, చీర్ల పల్లారెడ్డి, లచ్చిరెడ్డి సురేఖ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జీవీ శేషగిరిరావుతో పాటు, ప్రముఖ డాక్టర్ నార్ని భవాజీ, పెంటపాడు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు, గ్రామ ప్రముఖులు తదితరులు ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా 5 వేల మందికి జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

తణుకు టౌన్: శిరిడీ సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం మండలాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని వేంచేసియున్న శ్రీ రమణ మహర్షి ఆశ్రమంలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాబాకు పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగను అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, మండల వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు చుండ్రు శ్యామల, నాయకులు కె రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. తణుకు పైడిపర్రులో శ్రీ షిరిడీ సాయి బాబా ఆలయంలో బాబాకు లక్ష తులసి పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

బాబా మందిరాలలో గురు పౌర్ణమి వేడుకలు

అత్తిలి: గురు పౌర్ణమి సందర్భంగా అత్తిలి మండలం మంచిలి ఎన్టీఆర్ కాలనీలో గల శిరిడీ సాయిబాబా మందిరంలో అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. బాబావారికి నిర్వహించిన పంచామృతాభిషేకాలు, సామూహిక పూజలు, హారతి కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బాబా పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. బాబా వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గ్రామ పురోహితుడు పురాణపండ సుబ్బారావు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు.

ఘనంగా మెకానిక్ డే వేడుకలు


తణుకులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మోటారు మెకానిక్ సంఘం నాయకులు

పెంటపాడు: ప్రపంచ మెకానిక్‌ల డే సందర్భంగా మోటార్ సైకిల్ మెకానిక్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి సత్యనారాయణ, కొమ్మిశెట్టి వెంకట్రాజు, చిన్నం చినవెంకటరెడ్డి, మోహన్, గూడెంలోని పలువురు మోటార్ మెకానిక్ వెల్ఫేర్ సంఘ సభ్యులు పెంటపాడు సంఘ ప్రతినిధి గెద్దాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: ప్రపంచ మెకానిక్‌ల డేను అత్తిలి శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షులు యడ్లపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ గాట్లీబ్ డైమ్లర్ 1885 సంవత్సరంలో టూవీలర్‌ను కనిపెట్టారని, ఆయనను స్మరించుకుంటూ ప్రతీ ఏడాది జూలై 3న బైక్ మెకానిక్స్‌డేగా జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో టేకు శ్రీను, బైక్ మెకానిక్స్ పాల్గొన్నారు.

మెకానిక్‌ల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

తణుకు టౌన్: మోటారు సైకిల్ మెకానిక్‌ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని తణుకు గురు పద్మజ మోటారు సైకిల్ రిపేరింగ్ వర్కర్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి, తణుకు శాఖ అధ్యక్షుడు నాయుడు వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం జాతీయ మెటారు మెకానిక్ దినోత్సవం సందర్భంగా తణుకులోని మోటారు రిపేరింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోటారు మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయ రహదారి నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి సిరికోటి సత్యనారాయణ, కోశాదికారి బొక్కా నాగేశ్వరరావు, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు పీ లక్ష్మీనారాయణ, చిక్కాల శ్రీనివాసరావు, చిట్టూరి గనిక ప్రసాదరావు, మోటుపల్లి లక్ష్మణరావు, సభ్యులు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

12న మండల పరిషత్ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేది ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

దళితులకు జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు


తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జగజ్జీవన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దళితులకు జగన్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్, మానిటరింగ్ కమిటి సభ్యుడు తెన్నేటి జగజ్జీవన్ అన్నారు. ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జగజ్జీవన్‌ను ఆదివారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా జగజ్జీవన్ మాట్లాడుతూ గత ఏ ప్రభుత్వాల హయాంలో జరనని విధంగా సీఎం జగన్ పాలనలో దళితులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ నాయకులు కంకట రత్నకుమార్, పట్టణాధ్యక్షుడు లంకా రాజశేఖర్, సీనియర్ నాయకులు దూలపల్లి శ్రీనివాస్, గాలింకి ప్రేమ్‌కుమార్, కోశాధికారి పెదముత్తి ఆనంద్, పెదముత్తి చిన్ని, దేవతల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన


అత్తిలి మండలం గుమ్మంపాడు లాకుల వద్ద సాగునీరు సరఫరా చేయాలని నిరసన తెలుపుతున్న రైతులు

అత్తిలి: కాలువలకు నీరు విడుదల చేసి నెలరోజులు దాటినప్పటికీ నేటికీ నారుమళ్ల ఏర్పాటుకు నీటి సరఫరాలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేసారు. గుమ్మంపాడు లాకుల వద్ద సోమవారం సాయంత్రం బల్లిపాడు, గుమ్మంపాడు, తిరుపతిపురం గ్రామాలకు చెందిన రైతులు సాగునీరు సరఫరాలేకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేసారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నారుమళ్ల ఇంకా పూర్తికాలేదని, పోసిన నారుమళ్లకు నీటి సరఫరా లేక బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఇటీవల బల్లిపాడు పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు తెలిపామన్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి తక్షణమే లాకుల వద్ద గేట్ల తలుపులకు మరమ్మతులు చేపట్టాలని, అన్ని బ్రాంచ్ కాలువలకు నీటిని సక్రమంగా పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. సాగునీటి సమస్యను పరిష్కరించకపోతే రైతులంతా కలిసి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఇరిగేషన్‌శాఖ ఏఈ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా గుమ్మంపాడు లాకుల వద్ద గేట్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉందని. వీటికోసం రూ. 6 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, కాంట్రాక్టర్ వచ్చి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అత్తిలి కాలువకు ఎగువ ప్రాంతంనుంచి నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున సాగునీటి సమస్య ఏర్పడుతోందని ఏఈ వివరించారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తణుకు: గత నాలుగు రోజులుగా ఎండవేడిమితో అవస్థలు పడిన తణుకు పట్టణ ప్రజలు సోమవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షంతో ఉపశమనం పొందారు. గత వారంలో రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మరోసారి ఎండతీవ్రత ఆందోళన కలిగించింది. ఈ పరిస్థితుల్లో నాలుగు రోజులుగా ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరుకకావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇంట్లోంచి బయటకు రావడానికి సాహసించలేకపోయారు. మరోవైపు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించలేదు. దీంతో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. చిరుజల్లులతో పాటు మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

నారుమడిలో నీరు మార్చాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఎండలు ఎక్కువగా ఉండటం, నీరు వేడెక్కడం వంటి కారణాలతో నారు చివర్లు ఎండిపోతాయని, దీని నివారణకు నారుమడుల్లో నీరు మార్చాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో నారుమడులు, వరి నాట్లను ఆయన పరిశీలించారు. నారులో మొవ్వు పురుగు ఉంటే ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి వేసుకోవాలని సూచించారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయండి


అత్తిలిలో లయన్స్‌క్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అత్తిలి: సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ చినమిల్లి సత్యనారాయణ నూతనం బాధ్యతలు స్వీకరించిన లయన్స్ సభ్యులకు సూచించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ నూతన పాలకవర్గ అధ్యక్షునిగా శింగులూరి వెంకట సత్య చంద్రశేఖర్, కోఆర్డినేటర్‌గా పట్నాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి వెంకట సూర్యనారాయణ, బూర తాండవకృష్ణప్రసాద్, కార్యదర్శిగా శీతాల వెంకట నారాయణ, జాయింట్ సెక్రటరీగా కొలగాని చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటర్‌గా కొరిపల్లి వీర వెంకటసత్యనారాయణ, కోశాధికారిగా శిరగాని నాగేశ్వరరావు(నాగులు), జాయింట్ కోశాధికారిగా సన్నిధిసూర్యనారాయణ గుప్త, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా యాతం రాంబాబు, మార్కెటింగ్ కమ్యూనికేషన్ చైర్‌పర్సన్‌గా వేమన సోమేశ్వరరావు, గ్రీటర్స్ కమిటీ చైర్మన్‌గా దొడ్డిపట్ల కోటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. మాజీ గవర్నర్ ఎంపీఎస్ రాజు, కాకరాల వేణుబాబు, ఎంవీవీఎస్ పాపారావునాయుడు పాల్గొన్నారు.

ఇరగవరం పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

ఇరగవరం: మండలంలోని పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సోమవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విచ్చేసిన ఎస్పీ పోలీసు స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారుల పట్ల పోలీసు సిబ్బంది స్నేహపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, ఎస్సై కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెంట్లమ్మ ఆలయంలో భారీ అన్నసమారాధన

పెంటపాడు: గురుపౌర్ణమి పురస్కరించుకొని కె. పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామివారి ట్రస్టుబోర్డు మెంబర్, ఆర్య వైశ్యసంఘ గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు,వాస్తు జ్యోతిష్య నిపుణులు దండుమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
4-7-2023

స్టాక్ మార్కెట్లు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	486	65,205
నిఫ్టీ ▲	134	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కేజీ)	75,500

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేదీ
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయ్యొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోటక్లు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కన్స్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశీష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హన్స్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హన్స్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1000
» **అర్హత:**ఏదైనా డిగ్రీ,సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
» **పోస్టింగ్ స్థలం:** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.07.2023
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:**ఆగస్టు రెండు/మూడో వారం
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:**4,045 క్లర్క్ పోస్టులు
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
» **ప్రిలిమినరీ పరీక్ష తేది:**2023 ఆగస్టు/సెప్టెంబర్‌లో
» **మెయిన్స్ పరీక్ష తేది:** అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023
» **వెబ్‌సైట్:** www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీబీవీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69,పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(మ్యాథమెటిక్స్)-45,సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4,సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5,సీఆర్‌టీ(సైన్స్)-6,సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.



- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** జూలై 5, 2023
- **రాత పరీక్ష తేది:** జూలై 2023
- **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..

ఐఐటీ ఇండోర్


ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.



ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.